క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

నూజెండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 నిమిషాలకు ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఈసమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు, కో ఆప్షను సభ్యులు, మండల గ్రామస్థాయి అన్ని శాఖల అధికారులు హాజరు అవుతారన్నారు.

నూతన అడ్మిషన్లు స్వీకరణ

నూజెండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మండలంలోని పెద్దారం గ్రామం ఎంపీపీ స్కూల్లో నూతన అడ్మిషన్లు కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఘంటా నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడి అంటే మన బడి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న వారందరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు



నూజెండ్ల: మండలంలోని కమ్మువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటకట్ల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి నెలపౌర్ణమి వేడుకలు మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి సన్నిధిలో పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి కోసూరి రామమోహనాచార్యులు స్వామివారికి పంచామృత అభిషేక తోమాల సేవ, మహానైవేద్యం తదితర విశేష పూజలు నిర్వహించారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

శావల్యాపురం: జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి మంగళవారం తెలిపారు. నియోజకవర్గంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వేసవికాలం కావటంతో చేత ఉష్ణోగ్రత తీవ్రత ఆధారంగా ఉదయం–సాయంత్రం సమయాల్లో ఉపాధి కూలీల చేత ఫీల్డ్ అసిసెంట్స్ పనులు చేయించాలన్నారు. త్వరలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేత నాలు బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పంట కాల్వలు, నీటి కుంటల పనులను ఉపాధి కూలీలు చేస్తున్నట్లు వెల్లడించారు. శావల్యాపురం మండలం–2321, బొల్లాపల్లి–4889, ఈపూరు–1038, నూజెండ్ల–4194, వినుకొండ రూరల్ మండలం–2606 మంది ఉపాధి కూలీలు మంగళవారం ఉపాధి పనులను చేసినట్లు తెలిపారు. వంద రోజుల పనిదినాలు ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు.

మూడు రోజులపాటు సువార్త సభలు



చిలకలూరిపేట టౌన్: శాంతిసమాధానాలు లభించి ప్రశాంత జీవనం సాగించేందుకు ఏసు క్రీస్తు చూపిన ఆధ్యాత్మికమే ఏకైక మార్గమని పాస్టర్ ఎస్. అనిల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని సాంబశివనగర్ చర్చి రోడ్డులో సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజుల పాటు సువార్త సభలు నిర్వహించనున్నట్లు మంగళవారం వెల్లడించారు. ముందుగా సువార్త కూటాలకు సంబంధించిన పోస్టర్‌ను చర్చిలో ఆవిష్కరించి వివరాలను తెలిపారు. ఈ సభల్లో నరసరావుపేటకు చెందిన ప్రముఖ ప్రసంగికుడు డాక్టర్ కె.వి. వసురాజు, హైదరాబాదుకు చెందిన ప్రసంగికురాలు కె.మేరీబా జోహాన్న ముఖ్య వాక్య సందేశాలతో పాల్గొంటారన్నారు. ప్రతి సభలో విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని పాస్టర్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. సభల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆత్మీయ సందేశాలు అందించనున్నట్లు తెలిపారు.

ఆరంభమైన పోలేరమ్మ తిరుణాళ్లు



యద్దనపూడి: మండలంలోని మైదవోలు గ్రామంలో మంగళవారం గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరుణాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. భక్తులకు ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి భక్తులు గుడి వద్దకు తరలివచ్చి పొంగళ్ళు పొంగించారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తూ తమ మొక్కులు తీర్చుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మార్మోగింది. తిరుణాళ్లకు వచ్చిపోయే భక్తులతో మైదవోలు, లింగారావుపాలెం గ్రామాల్లో తిరుణాళ్ల సందడి నెలకొంది. గుడితోపాటు తిరునాళ్లకు వచ్చిన ప్రభల విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం తళుకులీనింది. తిరుణాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

వీళ్లకు నిబంధనలు పట్టవు

- యథేచ్ఛగా నీటి వ్యాపారం
- అటకెక్కిన ప్రమాణాలు
- గతి లేక కొంటున్న ప్రజలు
- దాడులు చేసే అధికారులు కరువు!



చిన్న గదిలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్



ఆటోలో లోడ్ చేస్తున్న వాటర్ బబుల్స్

చిలకలూరిపేట: వేసవి కారణంగా పెరిగిన తాగు నీటి డిమాండ్ స్వచ్ఛజలం పేరుతో చెలామణి అవుతున్న వాటర్ ప్లాంట్ల యజమానులకు కాసులు కురిపిస్తోంది. మినరల్ వాటర్ పేరుతో చెలమణి అవుతున్న నీటికి గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిమాండ్ ఏర్పడింది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ఏవీ ఇక్కడ అమలు కావడం లేదు. అయినా అధికారులు దాడులు చేసి పరీక్షలు జరిపిన దాఖలాలు అస్సలు కానరావు.

శుద్ధజలం కోసం వెంపర్లాట

చిలకలూరిపేట పట్టణంలో మున్సిపల్ అధికారులు రోజుమార్చి రోజు విడుదల చేసే మంచినీరు పైపు లైన్ లీకుల కారణంగా తాగునీటి అవసరాలను తీర్చకపోవటం, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు ఎండిపోయి కలుషిత నీరు సరఫరా కావటంతో మినరల్ వాటర్‌పేరుతో చెలామణి అవుతున్న నీటి కోసం ప్రజలు వెంపర్లాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్‌టీఆర్ సుజల పేరుతో ప్రారంభించిన ప్లాంట్లు నిర్వహణ లోపంతో ప్రజల నీటి అవసరాలను తీర్చలేకపోతున్నాయి.

నీటితో వ్యాధులు ప్రబలే అవకాశం!

చిన్నపాటి గది తీసుకొని నీటిని నిల్వ చేసి అదే మినరల్ వాటర్‌గా పంపిణీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే బోర్ల ద్వారా సేకరించిన నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయకున్నా అదే మినరల్ వాటర్ పేరుతో చెలామణి చేస్తున్నారు. వేసవిలో నీటి ద్వారా పలు వ్యాధులు దరిచేరే ప్రమాదం ఉండటంతో మినరల్ వాటర్ పేరుతో సరఫరా అవుతున్న నీటి విషయంలో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. నీటిశుద్ధి నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోతే డయోరియా, కామెర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నీటి శుద్ధి కోసం మోతాదుమించి క్లోరిన్ వాడితే ప్రాణాంతకరమైన కాన్సర్ సోకే అవకాశం ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు ఇవే...

గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు తీసుకొని వాటర్ ప్లాంట్ పెట్టాలంటే కనీసం రూ. 40 నుంచి రూ.50 లక్షలు వ్యయం అవుతుంది. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. కోటి వరకు పెట్టుబడి వెచ్చించాల్సి ఉంటుంది. వీటిని ఏర్పాటు చేయటానికి 22 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ లైసెన్స్, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల అనుమతి ఇస్తూ తీర్మానం, చుట్టుపక్కల ప్రజల నుంచి నోఅబ్జక్షన్ సర్టిఫికేట్ అవసరమవుతాయి. దీంతో పాటు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కు ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నది తెలియజేస్తూ వివరాలతో కూడిన మ్యాప్ అందజేయాలి. నీటి నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్ ఏర్పాటు, అందులో బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వ్యక్తిని నియమించాలి. వాటర్ బాటిల్స్ నింపే ప్రాంతంలోనూ, ల్యాబ్‌లోనూ ఏసీ సౌకర్యం కల్పించాలి. పూర్తి స్థాయిలో పరిశుభ్రత పాటించాలి. ఎక్కడో ఒక చోట తప్పించి అత్యధిక ప్లాంట్లలో ఇవేవి కనిపించవు. కొన్ని ప్రాంతాల్లో చిన్న గదుల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసి మిషనరీ పెట్టి భూగర్భజలాలను, మున్సిపల్ కుళాయి నుంచి నీటిని నింపి మంచినీరుగా చెలమణి చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణి



ముప్పాళ్లలో మాట్లాడుతున్న సీడీపీవో

బొల్లాపల్లి: గర్భిణులు, బాలింతలు పోషకవిలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ముప్పాళ్ల, మేళ్లవాగు గ్రామాల్లో నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముప్పాళ్ల గ్రామంలో నిర్వహించిన పక్షోత్సవాల్లో సీడీపీవో పాల్గొని మాట్లాడుతూ ఆకుకూరలు, కాయకూరలు, చిరుధాన్యాలు వంటి ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గర్భం ధరించిన నాటి నుంచి బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పోషకలోపం ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని, లోప నివారణ తగు సూచనలు చేశారు. మేళ్లవాగు సెంటర్‌లో బరువు తక్కువ చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారం, మునగాకులోని పోషకవిలువల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిన్నమ్మాయి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించేందుకు పోషణ్ పక్వాడా

నరసరావుపేట రూరల్: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణి తెలిపారు. మండలంలోని రావిపాడు ఎస్‌సి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉమారాణి మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గర్భం దాల్చిన మొదలు పిల్లలు రెండవ పుట్టినరోజు వరకు మొదటి 1000 రోజుల ప్రాధాన్యతను తెలియజేశారు. దీని వలన పిల్లలు మెదడు, శారీరక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఏఐ ఆధారిత పోషణ్ ట్రాకర్ ఇప్పుడు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసినట్టు వివరించారు. లబ్ధిదారుల వివరాలు, భోజన పంపిణీ, ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ట్రాకర్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ జ్యోతిమేరి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, విజయకుమారి, ఈశ్వరి, రాజకుమారి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

నాదెండ్ల: ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడి ఏడాది పొడవుగా భూమిని పచ్చగా ఉంచుతూ ఆరోగ్యకర పంటలు పొందవచ్చని యూనిట్ఇన్‌చార్జి సాయి శ్రీనివాసరావు చెప్పారు. చందవరం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025–26లో ప్రతి ఒక్క రైతు పాడిపశువుల వివరాలు, పంటల వివరాలు సిబ్బందికి తెలియజేయాలన్నారు. తొలకరి వర్షానికి ముందు కర్బన శాతాన్ని పెంచేలా భూమిని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి ఎకరాకు 500 కేజీల ఘనామృతం చల్లాలన్నారు. అంతర పంటల సాగుతో రైతులకు వ్యవసాయ ఖర్చులు కలిసిరావటమే కాక అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పంటల ఉత్పత్తులతో ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ కాటంరాజు, రైతులు, పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ ప్రహరీ, గేటు ప్రారంభం



వినుకొండ: పట్టణంలోని 3వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డలారి ఏడుకొండలు కుటుంబసభ్యుల ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన ప్రహరీ, మెయిన్ గేటును ఎంఈవో జప్రుల్లాఖాన్, ఎంఈవో –2 పార్వతి, పాఠశాల హెచ్‌ఎం జేసీయా నాయక్, సిబ్బంది ప్రారంభించారు. పట్టణ ప్రముఖులు, సెవెన్ హీల్స్ బీఈడీ కాలేజీ అధినేత డలారి ఏడుకొండలు 4వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జరిగిన సభలో ఎంఈవో మాట్లాడుతూ గతంలో ఆయన కుమారులు డలారి ఆంజనేయులు, డలారి అనిల్‌కుమార్‌లు రూ.2.40 లక్షలు విరాళంగా అందించారని, ఆ నగదుతో ప్రహరీ, గేటును నిర్మించి ఈ రోజు ప్రారంభించడం జరిగిందని వివరించారు. ఏడుకొండలు చిరస్మరణీయులని, ఆయన చేసిన సామాజిక సేవలు ఎనలేనివని, అదే బాటలో వారి కుమారులు నడవడం గొప్పవిషయమని కొనియాడారు.

గణపవరంలో వైభవంగా తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, అంకమ్మ తల్లులు



వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన విద్యుత్‌ప్రభ

- పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న వైఎస్సార్ సీపీ ప్రభ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతలు పోలేరమ్మ, అంకమ్మ తల్లి ఆలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రసాదాల వితరణ చేశారు. తాగునీరు, మజ్జిగ, పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి, పాలతాలికలు, వెజిటబుల్ బిర్యానీ, శనగ గుగ్గిళ్ళు పంపిణీ చేశారు. గ్రామోత్సవానికి ముందు గణపవరం, పెదగొట్టిపాడుకు చెందిన చిన్నారులతో నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం ఆలయం వద్ద మొక్కుబడుల ప్రభలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ కమిటీ సభ్యులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయం వద్ద గణపవరం, కావూరు గ్రామాల మహిళల కోలాట ప్రదర్శన, పాట కచేరీ ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న వైఎస్సార్ సీపీ విద్యుత్‌ప్రభ

తిరునాళ్ళ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ప్రభల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పాట కచేరీలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ తులం సుధాకర్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, స్థానిక నాయకులు అధికారి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, కృష్ణంరాజు, రహంతుల్లా, పీవీఆర్ చౌదరి, ఐతా శ్రీను, వెంకయ్య, రమేష్, జంపని సురేష్ పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రసాదాలు సమర్పిస్తున్న భక్తులు



చిన్నారుల కోలాట ప్రదర్శన

స్కౌట్స్, గైడ్స్ టీంలు ప్రారంభం

రొంపిచర్ల: విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి విద్యతో పాటు సేవా దృక్పధాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి డి. బ్రహ్మేశ్వర రావు అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం లో గల ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం నూతనంగా ఏర్పాటు అయిన స్కౌట్స్ అండ్ గైడ్స్ టీంల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కౌట్స్ టీంకు అల్లూరి సీతారామరాజు టీం అని, గైడ్ టీంకు డొక్కా సీతమ్మ ట్రూప్ అని నామకరణం చేశారు. స్కౌట్ టీంకు ప్రిన్సిపల్ డాక్టర్ బి. రవినాయక్ మాస్టర్‌గా వ్యవహరించనుండగా, గైడ్స్ టీంకు ఎస్‌కె ఫరీదా కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. విద్యార్థులకు సేవా భావం ఎంతగానో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వి. రామిరెడ్డి, గంగారపు సైదులు రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో దరఖాస్తులు ఆహ్వానం

బొల్లాపల్లి: రానున్న విద్యాసంవత్సరానికి ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో బలహీనవర్గాల చిన్నారులు 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని మండల ఇన్‌చార్జి ఎంఈవో –1 సయ్యద్ జప్రుల్లా తెలిపారు. 2025–26 సంవత్సరానికి ఆయా పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం, 2009 సెక్షన్ 12 (1) సీ అనుసరించి 5 సంవత్సరాలు నిండిన పేద పిల్లలకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ప్రవేశానికి సంబంధించి ఉచిత విద్యకు అవకాశం ఉందన్నారు. ఆయా కేటగిరీలకు సంబంధించిన పేద విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని, ఉచిత విద్య పొందడానికి 1వ తరగతి నుంచి అవకాశం ఉందని ఎంఈవో తెలిపారు.

సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థుల్లో సృజనాత్మకత

నాదెండ్ల: విద్యార్థులకు కొన్ని సైన్సు ప్రాజెక్టుల ద్వారా నిజజీవితంలో ఇన్నోవేటివ్, క్రియేటివిటీ పెరిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని రాష్ట్ర యూనిసెఫ్ కన్వీనర్ సుధీర్‌షాన్ చెప్పారు. నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు సంబంధించి అటల్ బూట్ క్యాంప్ యాక్టివిటీస్‌పై రెండు రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. తొలిరోజు శిక్షణా తరగతులను జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి ప్రారంభించారు. రెండోరోజు శిక్షణా తరగతులను యూనిసెఫ్ కన్వీనర్ సుధీర్‌షాన్ ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకునేలా పలు సూచనలు చేశారు. శిక్షణ అనంతరం మురికిపూడి జెడ్పీ హైస్కూలు, ఎస్‌బీ పురం జెడ్పీ హైస్కూలు, గణపవరం జెడ్పీ హైస్కూలు, నాదెండ్ల జెడ్పీ హైస్కూలు, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాల, నాదెండ్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవీలత, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రత్నకుమారి, సైన్స్ టీచర్ వెంకటలక్ష్మి, విజ్ఞాన్ ఆశ్రమ్ కోఆర్డినేటర్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, ప్లాస్టిక్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం గ్రామ పంచాయతీల్లో కళాజాత బృందంచే ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను, బాల్య వివాహాలు, పారిశుద్ధ్యం, తడి చెత్త పొడిచెత్త, చెత్త నుంచి / సంపద తయారు చేసే కేంద్రం ఉపయోగించుకునే విధానం, తడిపొడి ప్రమాదకరమైన చెత్తను వేరు చేయు విధానం గురించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం గురించి ప్లాస్టిక్ కవర్లు మాని గోనెసంచులు, గుడ్డ సంచులు వాడాలని, ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి పది సంవత్సరాలు పడుతుంది కాబట్టి ప్లాస్టిక్ నిషేధించాలని తెలిపారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లవానికి 21 సంవత్సరాలు వయసు నిండిన తర్వాతనే మ్యారేజ్ చేయాలని తద్వారా వారికి ఆరోగ్య తెలివితేటలు ఆ వయసులో పొందుకుంటారని అలా లేని పక్షంలో రెండు లక్షల జరిమానా విధించడం జరుగుతుందని పాటల ద్వారా జోకులతో నవ్విస్తూ కళాకారులు వెంకటలక్ష్మి, మల్లికార్జునరావు బృందం వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన వృక్ష సమిధలు ప్రతిష్టా కార్యక్రమాలకు



పూజలు చేస్తున్న స్థానికులు

యద్దనపూడి: స్థానిక మేదర వీధిలో ఉన్న రెండు శతాబ్దాల పురాతన వృక్షం ఇటీవల ఆకస్మాత్తుగా నేలకొరిగింది. స్థానికులు ఈ వేపచెట్టును మహాలక్ష్మి అమ్మవారి ఆరాధన స్థలంగా భావిస్తూ, సంవత్సరాలుగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 20న ఇది నేలవాలడంతో వెంటనే తొలగించక, మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికుల ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి నైవేద్యాలు అర్పించి, హారతులు ఇచ్చారు. అనంతరం వృక్షాన్ని శాస్త్రోక్తంగా తొలగించారు. తొలగించిన వీటి భాగాలను జూన్ 5న జగ్గాపురం గ్రామంలో జరగనున్న బొడ్డురాయి (శీతలాంబ), పలు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించే హోమాల్లో ఉపయోగించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఆదికాలపు పవిత్రతతో, ఆధ్యాత్మిక శక్తితో ముడిపడిన వృక్ష భాగాలు హోమాలకు మరింత ప్రాధాన్యతనిచ్చేలా సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి...

కాపరు వైరు చోరీ చేసి..



ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపరు వైరు చోరీ



కరెంటు సరఫరా జరుగుతున్న పోల్

బొల్లాపల్లి: మండలంలో తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయి. వేర్వేరు చోట్ల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి చోరీ చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రేమిడిచర్ల సెక్షన్ పరిధిలోని రావులాపురం, రేమిడిచర్ల గ్రామాల సమీపంలోని పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపరు వైరు చోరీకి పాల్పడ్డారని రైతులు వాపోతున్నారు. చోరీకి పాల్పడేవారు ప్రత్యేకమైన కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఎంపిక చేసి ధ్వంసం చేస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం పొలాల్లో మిరప, పొగాకు వంటి పంటలు చివరి దశలో ఉన్నాయని రైతుల ఆవేదన. రేమిడిచర్ల సబ్‌స్టేషన్ సమీపంలోని పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టిన ప్రదేశంలో ఉన్న స్తంభానికి కరెంటు సరఫరా ఉందని ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు గమనించి ప్రమాదనివారణకు తగుచర్యలు తీసుకోవాలని రైతులు అంటున్నారు.

చెరువుకు మరమ్మతులు చేయాలి

శావల్యాపురం: మండల కేంద్రంలో చెరువులో మంచి నీరు నిండుగా ఉన్నా గ్రామస్తులకు మాత్రం గుక్కెడు మంచినీరు కరువవుతోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ దుస్థితి వచ్చిందన్న విమర్శలు లేకపోలేదు. రక్షిత మంచినీటి చెరువు నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవటం చేత తరుచూ మరమ్మతులు గురికావటంతో పాటు వేసవికాలం కావటంతో చేత తరుచూ పైపులైను పగలిపోవటం, విద్యుత్ మోటార్లు చెడిపోవటం తదితర సమస్యల కారణంగా పథకం పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పాటు అక్రమ కనెక్షన్లు నియంత్రణ చేయకపోవటం నెలవారీ వసూలు చేయటంలో పారదర్శకత లోపించి చివరకు పథకం నిర్వహణ కష్టతరంగా ఉంది. ప్రస్తుతం వేసవికాలం కావటం చేత కూలీ పనుల కోసం తెల్లవారుజామున పొలాలకు బయలుదేరి వెళ్ళి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి గ్రామంలో సాగర్ విడుదల లేకపోవటంతో తీవ్ర నిరాశకు గురై గత్యంతరం లేక చేతి పంపుల వద్ద బారులు తీరుతున్నారు. మంచి నీటి చెరువుకు ఫిల్టర్‌బెడ్స్ లేకపోయిన వినియోగించుకోవటానికి అనుకూలంగా ఉందని ప్రజలు సర్దుకుపోతున్నా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ మోటార్లు మరమ్మతులకు రావటంతో గ్రామంలోకి మంచినీరు సరఫరా నిలుపుదల జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ నిధులను వెచ్చించి తాగునీటి కష్టాల నుంచి గ్రామస్తులను విముక్తిలను చేయాలని ప్రజలు అధికారులు కోరుతున్నారు.

డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం



వరిగడ్డిని ట్రాక్టర్‌పై నుంచి జారవిడుస్తున్న డ్రైవర్

యద్దనపూడి: మండలంలోని యద్దనపూడి–జగ్గాపురం రోడ్డుపై మంగళవారం ఉదయం వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. వరిగడ్డిని లోడుతో వస్తున్న ట్రాక్టర్ విద్యుత్తు తీగలకు తగిలి మంటలు వ్యాపించాయి. అయితే డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. యద్దనపూడికు చెందిన పి. వీరాంజనేయులు ఇతర గ్రామం నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి, ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానిక రైస్ మిల్లుకు ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఎత్తు తక్కువగా ఉంచిన విద్యుత్తు తీగలు వరిగడ్డిని తాకాయి. దీంతో నిప్పురవ్వలు చెలరేగి వరిగడ్డిలో మంటలు అంటుకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా స్పందించి, వాహనాన్ని ఊరికి దూరంగా ఉన్న చవటి చెరువు కట్ట పైకి తీసుకెళ్లాడు. వరిగడ్డిని ట్రాక్టర్ నుంచి వేరుచేసి మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకున్నాడు. వెంటనే ట్రాక్టర్‌తో అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయాడు. అయినప్పటికీ ట్రాక్టర్‌లోని వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ వరిగడ్డిని సుమారు రూ.20 వేల వ్యయంతో కొనుగోలు చేసినట్లు బాధిత రైతు పి. వీరాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు ఎత్తుగా ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

ప్రకృతి సేద్యంతో ఎక్కువ దిగుబడి

ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాంతీయ సమన్వయకర్త రామచంద్రం

యద్దనపూడి: ప్రకృతి వ్యవసాయంతోనే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించగలమని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాంతీయ సమన్వయకర్త రామచంద్రం చెప్పారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామంలో పీఎండీఎస్ విధానంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రైతులతో అవగాహన సమావేశం నిర్వహించగా, ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ వ్యవస్థల గురించి అవగాహన కల్పిస్తూ, ప్రకృతి పద్ధతుల్లో సాగు చేసే ప్రయోజనాలను వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించి, వారికి సన్మానం చేశారు. పీఎండీఎస్ కిట్ల తయారీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అదనపు డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు సైదయ్య, అప్పలరాజు, నందకుమార్, సౌజన్య, బేబీ రాణి, ఐలయ్యతో పాటు ఎల్2, ఎల్3 సభ్యులు కూడా పాల్గొన్నారు.